ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జయశంకర్ భూపాలపల్లి
గురువారం 13 మార్చి 2025

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : గురువారం సా.. 6.31 గం॥
సహర్ : శుక్రవారం ఉ..5.03 గం॥

సైబర్ నేరాలపై అవగాహనకు..



నేడు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్

సందేహాలు నివృత్తి చేయనున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ : 87126 65552

వరంగల్ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పెరిగిన సాంకేతికతతో పాటు ఆన్‌లైన్ మోసాలు, నేరాలు కూడా రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌ల వినియోగం పెరిగిన తర్వాత సైబర్ మోసగాళ్ల మాయమాటలు చెబుతూ.. వినియోగదారులను బురిడీ కొట్టిస్తున్నారు. యాప్‌లు, రుణాలు, ఆఫర్లు అంటూ ఫోన్లు చేసి.. వినియోగదారుల ఖాతాలను లూటీ చేస్తున్నారు. రోజూ ఎక్కడో ఒక చోట.. ఎవరో ఒకరు వయసు, చదువుతో సంబంధం లే కుండా సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కుకుంటున్నారు. సొమ్ములు పోగొట్టుకుని మనోవేదనతో ప్రాణాలు కూడా తీసుకుంటున్న వారున్నారు. ఇలాంటి సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్న అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ద్వారా వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్‌కు ఫోన్‌చేసి ప్రజలు తమ సందే హాలను నివృత్తి చేసుకోవచ్చు.

మావోయిస్టు కొరియర్ల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు కొరియర్లు, ఇద్దరు మిలీషియా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఏఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వివరాలు వెల్లడించారు. వాజేడు మండలంలోని మరుమూరు రోడ్డు మలుపు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు అనుమానాస్పదంగా కనిపించారని ఏఎస్పీ తెలిపారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలు, కార్డెక్స్ వైరు, డిటోనేటర్లు, ఒక టిఫిన్ బాక్స్, బ్యాటరీలు, మందులు లభ్యమయ్యాని పేర్కొన్నారు. వాటితో ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేశామని చెప్పారు. అరెస్టు అయిన వారిలో జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం తిమ్మం పేట గ్రామానికి చెందిన

మిగతా 8లో..

అంతంతమాత్రమే!

ఎల్ఆర్ఎస్‌కు మందకొడిగా దరఖాస్తులు



- క్రమబద్ధీకరణకు స్పందన కరువు!
- 25 శాతం రాయితీలు ఇస్తున్నా ముందుకు రాని లబ్ధిదారులు
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న అధికారులు
- ప్రత్యేక బృందాల ద్వారా అవగాహన
- అయినా సీరియస్‌గా తీసుకోని వైనం

భూపాలపల్లిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఖాళీ స్థలాలన క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. దీని ఫీజులో 25 శాతం రాయితీని కూడా ప్రకటించింది. అయినా దీనికి స్పందన అంతంత మాత్రమే కనిపిస్తోంది. మునిసిపల్ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నా చాలా మంది ముందుకు రావడం లేదు.

లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ద్వారా ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశాన్ని చాలా మంది లైట్‌గానే తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఎల్ఆర్ఎస్ వల్ల లబ్ధిదారుకు ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో అధికారులు వివరిస్తూనే ఉన్నారు. అయినా ఆదరణ కరువైంది. రెండు రోజుల క్రితం వరకు జిల్లాలోని 69 గ్రామపంచాయతీలు, ఒక మునిపాలిటీ నుంచి 4,917 దరఖాస్తులు రాగా అందులో 104 దరఖాస్తుదారులు మాత్రమే ఫీజు చెల్లించారు. దీంతో ఆదాయం రూ.55 లక్షలు మాత్రమే వచ్చాయి.

నత్తనడకన సాగుతున్న ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎల్ఆర్ఎస్‌ను సమగ్రవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమాయత మయ్యారు. ఇందులో భాగంగా మునిసిపల్ పరిధిలోని 30 వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. జీవో 28 ప్రకారం ఎల్ఆర్ఎస్ ద్వారా ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయని లబ్ధిదారులకు తెలియజేస్తున్నారు. అయినా ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని తెలుస్తోంది.

ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకునే వాటిలో ఎల్ఆర్ఎస్ ఒకటి. దీని దరఖాస్తులు మాత్రం అంతంత మాత్రంగానే వస్తున్నాయి. స్థలాలను ధ్రువీకరించే విషయంలో కూడా జాప్యం జరుగుతోందనే వాదనలు ఉన్నాయి. అయితే భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు పాతవి, కొత్తవి కలిపి 3,771 దరఖాస్తులు రాగా అందులో 395 రిజెక్ట్ అయ్యాయి. 158 దరఖాస్తుల్లో సరైన డాక్యుమెంట్లు లేక పక్కన బెట్టారు. 527 స్థలం ప్రభుత్వ నిషేధిత భూముల్లో ఉన్నట్లు గుర్తించారు. 445 దరఖాస్తులు అధికారుల వద్ద పరిశీలన కోసం పెండింగ్‌లో ఉన్నాయి. 2,246 దరఖాస్తులు పేమెంట్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. 91 వాటికి పూర్తి స్థాయిలో పేమెంట్ అయ్యింది. ఇంకా 2,155 దరఖాస్తులు పేమెంట చేయడానికి పెండింగ్ ప్రాసెస్‌లో ఉన్నాయి. వీటి ద్వారా రూ.49 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. అలాగే లేవుట్ల రెగ్యులరైజేషన్ కోసం 24దరఖాస్తులు రాగా అన్నీ పెండింగ్ ప్రాసెస్‌లోనే ఉన్నాయి.

గ్రామపంచాయతీల్లో...

జిల్లాలో 241 గ్రామపంచాయతీలు ఉండగా ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ కోసం 69 గ్రామపంచాయతీల నుంచి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా 4,541 దరఖాస్తులు రాగా అందులో 309 భూములను నిషేధిత భూములుగా గుర్తించారు. 1,516 అధికారుల వద్ద పెండింగ్ ప్రాసెస్‌లో ఉన్నాయి. 2,716 పేమెంట్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. 13 మాత్రమే ఫీజు చెల్లించారు. 2,703 దరఖాస్తులకు పెండింగ్ పేమెంట్ ఉంది. వీటి ద్వారా ఇప్పటి వరకు వచ్చిన ఆదాయం రూ. 6.2 లక్షలు మాత్రమే. ఇంకా కొత్తగా లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం 36 దరఖాస్తులు రాగా అందులో ఒక దానిని ప్రభుత్వ నిషేధిత భూమిగా గుర్తించారు. అలాగే ఇంకా 35 పెండింగ్‌లో ఉన్నాయి.

ఆశించిన ఫలితాలు రాక..

ఎల్ఆర్ఎస్ ద్వారా కోట్లలో ఆదాయం వస్తుందనుకున్న అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి. దరఖాస్తులు అనుకున్న స్థాయిలో రాకపోవడంతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అధికారులు నానా తంటాలు పడుతున్నారు. మార్చి 31వరకు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే 25శాతం రాయితీ వర్తింస్తుందని ప్రచారం చేపట్టారు. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో కమిషనర్ బిర్రు శ్రీనివాస్ అన్ని వార్డుల్లో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ఒకవైపు వార్షిక ఆదాయాన్ని సమకూర్చుకోవడం కోసం సిబ్బంది ద్వారా పన్నుల వసూలుకు తిప్పుతూనే, మరోపక్కా ఎల్ఆర్ఎస్‌పై విస్తృత ప్రచారం చేపట్టారు.

ఎల్ఆర్ఎస్‌తో ప్రయోజనాలు ఇవే..

క్రమబద్ధీకరించే ప్లాటు కోసం భవన నిర్మాణ అనుమతులు సులభంగా, సత్వరంగా తీసుకోవచ్చు. ప్రస్తుత మార్కెట్ రేటు కంటే డాక్యుమెంట్‌లో ఉన్న ధర ప్రకారమే రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత మార్కెట్ రేట్ కంటే ఎల్ఆర్ఎస్ ఫీజు తక్కువే ఉంటుంది. బ్యాంకు లోన్ కోసం ప్రాసెసింగ్ చాలా సులభతరం అవుతుంది. భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు 33శాతం చార్జీలు ఉండవు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకొనే వారు హెచ్‌టీపీపీ //ఎల్ఆర్ఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్/లేఅవుట్స్ వెబ్ సైట్‌ను సంప్రదించొచ్చని మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ తెలిపారు.

పక్కా ప్రణాళికతో పుష్కరాల పనులు

ఫేస్ టు ఫేస్

మహేష్
కాళేశ్వరాలయ ఈవో



ఆంధ్రజ్యోతి: కాళేశ్వరాలయం ప్రత్యేక ఏమిటి?

ఈవో: త్రివేణి సంగమ ఒడ్డున ఉన్న కాళేశ్వర ముక్తీశ్వర స్వామి మహిమ గల దేవుడని పురాణాలు చెబుతున్నాయి. ఒకే పానవట్టంపై రెండు లింగాలు, అతి ప్రాచీన దేవాలయంగా పేరొందింది కాళేశ్వర క్షేత్రం.

ఆంధ్రజ్యోతి: మేలో జరిగే పుష్కరాలకు ఎలాంటి ప్రణాళిక సిద్ధం చేశారు?

ఈవో: సరసతీ పుష్కరాలకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదయా శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు పక్కా ప్రణాళిక ప్రకారం పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే పుష్కరఘాట్ వద్ద పనులు సాగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యవేక్షణ ఎలా ఉంది?

ఈవో: దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ రెండో రోజులకోసారి ఆలయ అభివృద్ధి పనుల గురించి ఆరా తీస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఆలయంలో ఒకరోజు విడిది చేసేందుకు భక్తులకు కనీస సౌకర్యాలు లేవని తెలుస్తోంది. దీనిపై మీరేం చర్యలు తీసుకుంటున్నారు?

ఈవో: త్వరలో వసతి గృహాలు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఎండాకాలం ఆలయంలో భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

ఈవో: ఎండాకాలం ఆలయంలో చలువ పందిళ్లు వేయిస్తున్నాం. చల్లటి తాగునీటిని అందుబాటులో ఉంచుతాం.

- మహదేవపూర్, ఆంధ్రజ్యోతి

కాళేశ్వరా మన్నించు..

- సరస్వతీ పుష్కరాల పనులకు గ్రహణం
- ఇప్పటి వరకూ ప్రారంభం కాని వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

6

హైదరాబాద్‌లో

ప్రిన్సిపల్ సెక్రటరీ సమావేశం

మహదేవపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతోపాటు పలువురు ఉన్నతాధికారులతో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ హైదరాబాద్‌లో బుధవారం సమావేశమయ్యారు. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో మే 15 నుంచి జరిగే సరస్వతీ పుష్కరాలపై సమీక్షించారు. పనులను యుద్ధ ప్రాతిపదకిన పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వం రూ.25 కోట్లతో పనులు చేపడుతుండగా పుష్కరాలకు ఇంకా రెండు నెలలు మాత్రమే సమయం ఉన్న దృష్ట్యా వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే అనేక పనులు ప్రారంభించాల్సి ఉండగా ఎందుకు ఆలస్యమవుతోందని ప్రశ్నించినట్టు తెలిసింది. తెలంగాణలోనే పెద్ద కుంభామేళాగా సరస్వతీ పుష్కరాలు జరుగుతాయని, ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతం చేయాలన్నారు.

మద్యం పట్టివేత.. ఐదుగురిపై కేసు

మహాముత్తారం, మార్చి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కునుకునూర్, సింగంపల్లి, మహాముత్తారం, నర్సింగాపూర్ గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు బుధవారం విస్తృత తనిఖీలు చేశారు. సుంకుం చెల్లించకుండా మద్యాన్ని అమ్ముతున్న ఐదుగురిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి 9.3 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా అక్రమంగా నిల్వ చేసిన 21.9 లీటర్ల లిక్కర్, 22.1 లీటర్ల బీర్లను పట్టుకున్నారు. వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, భూపాలపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. భూపాలపల్లి అసిస్టెంట్ సూపరింటెండెంట్ లింగాచారి అధ్వర్యంలో దాడులు జరిగాయి.



ఇద్దరు నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

ఎర్రగట్టు వేంకన్న జాతరకు వేళాయే..

- రేపటి నుంచి ఐదురోజుల పాటు బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి.. పోలీసుల బందోబస్తు

వివరాలు 7వ పేజీలో...

మేడారంలో భక్తుల సందడి



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. సమక్క, సారలమ్మ వనదేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం(బెల్లం), యాట మొక్కులను సమర్పించుకున్నారు. సుమారు 5వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని వినతి



కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్లను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఏవో రాజ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్డీ.దావూద్, రత్నం రాజేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లను, ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలని అన్నారు. దీనివల్ల పూర్వ ప్రాథమిక ఎలిమెంటరీ స్థాయి విద్యార్థులను ప్రైమరీ స్కూళ్లకు పంపిస్తే అంగన్‌వాడీ సెంటర్లు మూతపడే పరిస్థితి ఉందని అన్నారు. 50 ఏళ్లుగా అనేక ప్రజాదరణ పొందిన ఐసీడీఎస్‌ను కేంద్ర ప్రభుత్వం బలోపేతం చేయాల్సిందిపోయి రకరకాల పథకాలతో నిర్వీర్యం చేసే విధానాలను అవలంబిస్తుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా వంతపాడుతుందని అన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీలకు ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు అందించాలని, ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు పెరిగిన వేతనాలు ఇస్తూ 11నెలల ఏరియర్స్ అందించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలు పెంచాలని, ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 17, 18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట 48గంటల నిరసన ధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కూరెందుల సమ్మక్క, పద్మారాణి, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, సరిత, దీప, లక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

కేసముద్రం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం పెనుగొండ గ్రామ చెరువులో స్నానం చేసేందుకు దిగి ప్రమాదవశాత్తు మునిగి షేక్ ఇస్మాయిల్(22) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. కొత్తగూడెంకు చెందిన ఇస్మాయిల్ కొద్దినెలల క్రితం తల్లిదండ్రులతో సహా పెనుగొండకు ఉపాధి నిమిత్తం వచ్చాడు. తండ్రి ఇమాం మేకలు కాయడం, తల్లి కూలీ పని, ఇస్మాయిల్ సెంట్రింగ్ పని చేస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం చెరువులో స్నానం చేసేందుకు ఇస్మాయిల్ దిగగా ప్రమాదవశాత్తు మునిగిపోయి ఈత రాక మృతి చెందాడని, బుధవారం సాయంత్రం చెరువులో మృతదేహం తేలి ఉండడం చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. రాత్రి మృతదేహాన్ని వెలికితీసి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాళేశ్వరా మన్నించు..

- సరస్వతీ పుష్కరాల పనులకు గ్రహణం
- ఇప్పటి వరకు ప్రారంభం కాని వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

మహదేవపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరాలయ అభివృద్ధికి గ్రహణం పట్టింది. సరస్వతీ పుష్కరాలు సమీపిస్తున్నా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రతి 12 ఏళ్లకోసారి త్రివేణి సంగమం గోదావరి వద్ద సరస్వతీ పుష్కరాలు జరుగుతుంటాయి. ఈసారి మే 15 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. పుష్కరాలకు భక్తుల కోసం సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆలయ అభివృద్ధి పనుల కోసం ఈ నిధులను కేటాయించారు. అయితే.. ఇప్పటి వరకూ పనులు ఏమాత్రం మొదలు కాలేదు. ఈ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుష్కరాలు సమీపిస్తున్నా పనులు ప్రారంభించకపోవడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



కాళేశ్వరంలో అభివృద్ధి పనుల కోసం పోసిన కంకర

రూ.25 కోట్లు మంజూరైనా..

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో పుష్కరాల కోసం రూ.25 కోట్లు మంజూరైనా ఇంతవరకూ తట్టెడు మట్టి పోసింది లేదు. ఒక్క పని కూడా చేసింది లేదు. పుష్కర ఘాట్ అభివృద్ధి, వీఐపీ ఘాట్‌కు రోడ్డు, పార్కింగ్, ఆలయంలో కొత్త అభివృద్ధి పనులు, బస్టాండ్ రహదారి, ఇతరాత్ర పనులు ఇంకా మొదలు కాలేదు. ఇసుక, కంకర కుప్పలు పోసి ఉంచారు గానీ, పనులు మాత్రం ప్రారంభించలేదు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ వరుస సమీక్షలు నిర్వహించి అభివృద్ధి పనులపై ఆరా తీసినా ఇంతవరకు అడుగులు ముందుకు పడకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. పుష్కరాలు సమీస్తున్న నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో పనులు ప్రారంభించినా హడావిడిగా పూర్తిచేసి చేతులు దులుపుకుంటారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆలయం నుంచి గోదావరి దాకా చలువ పందిళ్లు, నీడ ప్రదేశాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. గోదావరి ఒడ్డున స్నానపు గదులు, మహిళలకు దుస్తులు మార్చుకొనే గదులతో పాటు పలు శాశ్వత పనులు చేయాల్సి ఉండగా ఇవన్నీ సకాలంలో పూర్తవుతాయా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.



అసంపూర్తిగా అన్నసత్రం నిర్మాణం

అర్ధాంతరంగా ఆగిన ఆలయ అభివృద్ధి పనులు

తొమ్మిది సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయ అభివృద్ధి కోసం రూ.25 కోట్లు మంజూరు చేశారు. అప్పటి పనులు ఇప్పటివరకు పూర్తికాకపోగా కొన్ని భవనాలు మధ్యలోనే ఆగిపోయాయి. గతంలోనే నిధులు మంజూరైనా ఆ డబ్బులు లెక్కాపత్రం లేకుండా పనులు పూర్తి కాలేదు. వంద రూముల వసతి గృహాల నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. అన్నసత్రం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. భవనాల నిర్మాణాలను సగంలోనే వదిలేయడంతో అక్కడ చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగాయి.

మటన్ వండలేదని.. భార్యను కొట్టి చంపిన భర్త

- మహబూబాబాద్ జిల్లా మాంజాతండాలో ఘటన
- పరారీలో నిందితుడు.. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ

సీరోలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక సమాజంలో మనుషులు మృగాల్లా ప్రవర్తిస్తున్నారు. ప్రాణాలంటే విలువ లేకుండా, రాక్షసుల్లాగా క్రూరత్వాన్ని ప్రదర్శిస్తూ చిన్నచిన్న విషయాలకు అయిన వారినే కడతేరుస్తున్నారు. నిందితులుగా మారుతూ కటకటాల పాలవుతున్నారు. మటన్ వండలేదని కట్టుకున్న భార్యనే కొట్టి చంపాడు ఓ ఘనుడు. ఈ దారుణ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం బూరుగుచెట్టుతండా గ్రామపంచాయతీ పరిధిలోని మాంజాతండాలో మంగళవారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి బుధవారం మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మాంజాతండాకు చెందిన మాలోతు బాలుకు అదే తండాకు చెందిన కళావతితో 17ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉండగా.. కుమారుడు శరత్ వరంగల్ జిల్లాలోని అశోక్‌నగర్‌లో ఉన్న సైనిక గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కూతురు శ్రావణి సీరోల్ మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులంలో 8వ తరగతి చదువుతోంది. ఇక బాలు, కళావతి(38) దంపతులు ఇంటి వద్ద ఉంటూ.. తమకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈక్రమంలో సదరు తండాలో మంగళవారం ఓవృద్ధురాలు మృతి చెందగా, ఆమె అంత్యక్రియలు రాత్రి 7 గంటల సమయంలో పూర్తిచేశారు. అనంతరం రాత్రి వేళ ఓ గొర్రెపోతును కోసి, తలా కొంచెం మాంసాన్ని వారివారి ఇళ్లకు తీసుకుపోయారు. రాత్రి 11 గంటల సమయంలో ఆ మటన్‌ను ఇంటికి తీసుకువచ్చిన బాలు.. వండాలని భార్య కళావతిని కోరాడు. అంత రాత్రి సమయంలో మటన్ వండే విషయంలో కళావతి అభ్యంతరం చెప్పగా.. అప్పటికే మద్యం మత్తులో ఉన్న బాలు ఆమెతో గొడవ పడ్డాడు. అది కాస్తా ఇద్దరి మధ్య ఘర్షణగా మారగా విషయం తెలుసుకున్న అదే తండాలోని కళావతి తల్లిదండ్రులు ఇస్లావత్ లక్ష్మీ-వెంకన్న వారి ఇంటికి వచ్చి సర్దిచెప్పి, గొడవను సద్దుమణిగేలా చేశారు. వారు వెళ్లిపోయాక బాలు భార్యతో మళ్లీ గొడవపడి, తీవ్రంగా కొట్టి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం కళావతి తల్లిదండ్రులు మరోమారు కూతురు ఇంటికి వచ్చి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. దీంతో కళావతి తల్లిదండ్రులు సీరోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, సీరోలు ఎస్సై నగేష్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించగా.. నిందితుడు బాలు పరారీలో ఉన్నాడు.



మాంజాతండాలో కళావతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై నగేష్

పైఅంతస్థు నుంచి పడి మహిళ మృతి

కృష్ణకాలనీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని సింగరేణి ఎండీక్వార్టర్స్ పైఅంతస్తు నుంచి కిందపడి మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ తెలిపిన ప్రకారం... ఎండీక్వార్టర్స్‌లో నివాసముంటున్న బోగ లీలావతి (48) క్వార్టర్స్‌లోని పైఅంతస్థుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించేలోపే ఆమె మృతి చెందింది. లీలావతి మతిస్థిమితం సరిగ్గాలేదని, ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి చనిపోయిందని మృతురాలి భర్త బోగ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మహబూబాబాద్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లాకేంద్రం శివారు సాలార్‌తండా సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపినవివరాల ప్రకారం... కురవి మండలం సూదనపల్లి గ్రామానికి చెందిన కొల్లబోయిన సంపత్ (27) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో సాలార్‌తండా సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఢీకొన్నాడు. ఈ ఘటనలో సంపత్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంపత్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి సంపత్‌కు భార్య అఖిల, ఇద్దరు కుమారులు ఉన్నారు.



సంపత్ మృతదేహం

12 కిలోల గంజాయి పట్టివేత

కాటారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహాముత్తారంలో పోలీసులు 12 కిలోల 765 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాటారం తన కార్యాలయంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రంలోని నలంద జిల్లా గౌరి గ్రామానికి చెందిన 49ఏళ్ల గణేష్‌ఠాగూర్ మూడేళ్లుగా గణపురం మండలంలోని చెల్పూరులో రైస్ మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. జీతం సరిపోక అధిక మొత్తంలో ఈజీగా డబ్బులు సంపాదించాలనే దురాశతో గంజాయి విక్రయాలు చేయాలని తలచాడు. ఈ క్రమంలో విశాఖపట్నం జిల్లాలోని అటవీగ్రామాల పరిధిలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మహాముత్తారం పరిసర గ్రామాల్లో అధిక ధరలకు విక్రయించడాకి మంగళవారం రాగా విశ్వసనీయ సమాచారంతో మహాముత్తారం ఎస్సై మహేందర్ కుమార్ తన సిబ్బందితో గణేష్‌ఠాగూర్‌ను పట్టుకున్నాడు. అతడి వద్ద ఉన్న బ్యాగులో తనిఖీ చేయగా 12కిలోల 765గ్రాముల గంజాయి దొరికింది. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.2.55 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. గతంలోనూ గణేష్‌ఠాగూర్‌పై గణపురం పోలీస్‌స్టేషన్లో గంజాయి కేసు నమోదై ఉంది. జైలుకు వెళ్లి బెయిలుపై వచ్చిన అతడు మళ్లీ అదే దందా చేస్తూ పట్టుబడ్డాడని డీఎస్పీ చెప్పారు. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సీఐ నాగార్జునరావు, మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టును చూపిస్తున్న డీఎస్పీ, సీఐ



తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారులో బావిలో అడుగంటిన నీరు



కంఠాయపాలెం గ్రామంలో నెర్రెలు బారిన వరి పొలం

అడుగంటిన భూగర్భ జలాలు

- ఎండుతున్న పొలాలు
- సాగునీటి కోసం రైతుల ఇబ్బందులు

తొర్రూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో రోజు రోజుకు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో మాదిరిగానే ఎస్సారెస్పీ జలాలు వస్తాయనే ఆశతో భారీగానే వరి సాగు చేసిన రైతులు నీరు లేకపోవడంతో విలపిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం కొంతమేర అధికంగా ఉన్నా, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు, బావులు, చెరువుల్లో నీరు తగ్గింది. ఇది ఇలానే కొనసాగితే మార్చి, ఏప్రిల్ చివరి వరకు పంట చేతికి వచ్చే సమయంలో నీరందే అవకాశం లేకుండా పోతుంది. గత సంవత్సరం మార్చిలో 6.36 మీటర్లు ఉంటే ఈ ఏడాది ఫిబ్రవరిలోనే 5.16 మీటర్లు ఉంది అంటే 1.2 మీటర్ల వరకు నీటి మట్టం పడిపోయిందని సంబంధిత అధికారులుచెబుతున్నారు. ఎండ తీవ్రత పెరుగకముందే ఈ విధంగా నీటిమట్టం పడిపోతే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మండలంలో 16వేల ఎకరాల వరకు వరి సాగు, 2,400 ఎకరాల మొక్కజొన్న సాగు జరుగుతుంది. మొక్కజొన్న కొంతమేర చేతికి వచ్చే అవకాశం ఉన్నా, పొట్టదశలో ఉన్న వరితో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎస్సారెస్పీ జలాలు అనుకూలంగా రావడంతో కొంత భూగర్భ జలాలు పైన ఉండేవి. బావులు, బోర్ల కింద వేసిన పొలాలు చేతికివచ్చేవి. ప్రస్తుతం భూగర్భ జలాలు పడిపోవడంతో చేతికివచ్చే అవకాశం లేకుండా పోతోంది. జిల్లాలో నీటి సాంద్రత మీటర్లు 66 ఉండగా ప్రతిచోట కొంత మేర తగ్గిపోయినట్లు అధికారులు తెలిపారు. తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలో 2024 మార్చిలో 0.98 మీటర్లు ఉండగా 2025 ఫిబ్రవరిలో 1.35 మీటర్లు, తొర్రూరులో 2024 మార్చిలో 13.71 మీటర్లు ఉండగా 2025 ఫిబ్రవరిలో 7.85 మీటర్లు అంటే 5.86 మీటర్లు పడిపోయింది. పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లిలో 2024 మార్చిలో 5.01 మీటర్లు ఉండగా, 2025 ఫిబ్రవరిలో 5.33 మీటర్లు కొంత మేరకు పెరిగింది. చిన్నవంగరలో 2024 మార్చిలో 3.65 ఉండగా 2025 ఫిబ్రవరిలో 3.01 మీటర్ల వరకు నమోదైంది. మార్చి ముగిసే సమయానికి మరింతగా భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదం ఉందని, పొదుపుగా వాడుకోవాలని అధికారులు వెల్లడిస్తున్నారు.

ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయాలి
డొనుక ఉప్పలయ్య, అమ్మాపురం గ్రామ రైతు



బావులు, బోర్లలో నీరు సరిపోవడం లేదు భూగర్భ జలాలు అడుగంటాయి. ఎస్సారెస్పీ జలాలు వాటా బందీ కాకుండా సమృద్ధిగా విడుదల చేయాలి. వరి పంట పూర్తిగా పొట్ట, పాలు పోసుకునే దశలో ఉంది. మరో నెల రోజుల పాటు నీరందించాలి.. లేదంటే ఎండిపోతోంది. నీరు విడుదల చేస్తే బావులు, బోర్లలో కొంతమేర భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ

భూపాలపల్లిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ(ఏఎల్ఐఎంసీవో), సమగ్ర శిక్ష సౌజన్యంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను డీఈవో ఎం.రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 99 మందికి ఈ పరికరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. పరికరాలకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా ఐఈఆర్‌పీలను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. సమగ్ర శిక్ష ద్వారా భవిత పాఠశాలలకు వచ్చే దివ్యాంగ పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సులు వచ్చినట్లు తెలిపారు. అలాగే వీరికి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎంఈవో దేవానాయక్ మాట్లాడుతూ ప్రతిసారి జరిగే క్యాంపులకు తప్పనిసరిగా హాజరై పేరు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, ఏఎంవో లక్ష్మణ్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజగోపాల్, ప్రతినిధులు ప్రియవర్మ, సర్వన్‌కుమార్, తుషార్, రతన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు పరికరాలు పంపిణీ చేస్తున్న డీఈవో రాజేందర్

వంట కార్మికుల వేతనాల్లో అన్యాయం

- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్

ములుగు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా కమిషన్ చైర్మన్ అందజేసిన రిపోర్టులో వంట కార్మికుల వేతనాల అంశం లేకపోవడం అన్యాయమని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకం నిర్వహిస్తున్న విధానంపై అధ్యయనం చేసే విషయంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి వంటకార్మికుల పరిస్థితులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి రిపోర్టు అందజేశారని తెలిపారు. అయితే ఇందులో వంటకార్మికుల వేతనాల అంశం లేదని పేర్కొన్నారు. మరొకసారి పరిశీలన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వంట కార్మికులకు రూ.10వేల వేతనంతో పాటు మెనూ చార్జీ ప్రతి విద్యార్థికి రూ.25 చొప్పున చెల్లించాలని, వంట బిల్లులు సకాలంలో అందించే విధంగా ప్రభుత్వానికి సూచనలు, సలహాలు అందించాలని ఆయన కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2243	2100
పల్లికాయ (సూక)	7300	6500
పల్లికాయ (పచ్చిది)	4400	3400
కందులు	6656	5540
పెసళ్లు	7250	4645
పత్తి	6960	5800
పసుపు (కాడి)	7153	6522
పసుపు (గోల)	6219	6133
తేజ మిర్చి	13400	9000
డిడి	12500	12500
వండర్‌హాట్	16500	11500
ఎల్లో మిర్చి	17000	15000
యూఎస్341	13100	9500
దేశీ	32000	25500
సింగిల్‌పట్టి	37500	35000
దీపిక	16500	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మూత్రపిండం.. మేలుకోకపోతే గండం!

- రోజురోజుకు పెరుగుతున్న కిడ్నీ సంబంధ సమస్యలు
- అవగాహన లోపమే అసలు సమస్య

నేడు వరల్డ్ కిడ్నీ డే





వరంగల్ మెడికల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మానవ శరీరంలో మూత్రపిండాలదే కీలకపాత్ర అన్న విషయం అందరికీ తెలిసిందే. కిడ్నీలకు రోజుకు 200 లీటర్ల నీటిని శుద్ధి చేసే శక్తి ఉంటుందట. అత్యాధునిక వాటర్ ఫిల్టర్ కూడా వీటి ముందు దిగదుడుపేనట. అలాంటి కీలకమైన మూత్రపిండాల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా రోజురోజుకు మూత్రపిండ సంబంధ సమస్యల బారిన పడుతున్న వారు ఎక్కువవుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రక్తపోటు, మధుమేహం లాంటి సాధారణ వ్యాధుల జాబితాలోకి కిడ్నీ వ్యాధులు కూడా చేరే ప్రమాదం ఉంది. ఒకప్పుడు వయోవృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి మాత్రమే కిడ్నీ సమస్యలు వచ్చేవి. కానీ ప్రస్తుతం ఏ కారణం లేకుండానే.. ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే వయసుతో సంబంధం లేకుండా మూత్రపిండ సమస్యలు ఏర్పడుతున్నారు. వ్యాధి గురించి కళ్లు తెరిచేలోపే వ్యాధి ముదిరి డయాలసిస్, ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు దారితీస్తోంది. ఈ క్రమంలో మూత్రపిండాల ఆరోగ్యం విషయంలో మేలుకోకపోతే ప్రాణాలకే గండమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కిడ్నీ సంబంధ సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రతీ ఏడాది మార్చి రెండో గురువారాన్ని వరల్డ్ కిడ్నీ డేగా పాటిస్తున్నారు.

కిడ్నీ వ్యాధులకు ఇవే కారణాలు

పిడికిలి పరిమాణంలో ఉండే మూత్రపిండాలు శరీర అవయవాలు ఆరోగ్యంగా ఉండేలా రక్తం నుంచి విషాన్ని, అదనపు నీటిని తొలగించడానికి, రక్తపోటును నియంత్రించడానికి, ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేసేందుకు, ఎముకలను ఆరోగ్యంగా ఉంచేందుకు ఉపయోగపడతాయి. అదే విధంగా సోడియం, పొటాషియం లాంటి అనేక ఖనిజాలు, అణువుల రక్తప్రవాహ స్థాయిలను నియంత్రిస్తాయి. రక్తఆమ్లతను నియంత్రించడంలో సహాయ పడతాయి. శరీరం మొత్తంలో రసాయన సమతుల్యతను నియంత్రించడంలో కిడ్నీలు క్రియాశీలకంగా పని చేస్తాయి. ఇక కిడ్నీ సమస్యలకు మధుమేహం, అధిక రక్తపోటు, ఇన్ఫెక్షన్లతోపాటు వివిధ ఔషధాల ప్రభావం, శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు వాంతులు, విరోచనాలు లాంటివి ఇబ్బంది పెట్టినప్పుడు గుండె, కాలేయం, పనితీరు మందగించినప్పుడు, కిడ్నీలకు రక్త సరఫరా తగ్గినప్పుడు కూడా కిడ్నీ వ్యాధులు సంభవిస్తాయి. కిడ్నీలో రాళ్లు పడటం, బ్లాడర్‌లో రాళ్లు అడ్డుపడి మూత్ర ప్రసరణ తగ్గిపోవడం, మూత్రం వెనక్కి వెళ్లిపోయి ఒత్తిడి పెరగడం వల్ల ప్రోస్టేట్ సమస్యలు కూడా ఏర్పడి కిడ్నీలపై భారం పడుతుంది. మూత్రం తక్కువగా వస్తు కాళ్లలో, కాళ్ల చుట్టూ వాపు వస్తుంది. ఊపిరి తిత్తుల్లో నీరు చేరడం వల్ల ఆయాసం, దగ్గు ఇబ్బంది పెడతాయి. కొన్ని కొన్ని సందర్భాల్లో ఫిట్స్ కూడా రావచ్చు. కొన్ని సందర్భాల్లో కోమాకు కూడా వెళుతూ ఉంటారు. కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్న తర్వాత చివరి దశలో కొందరికి బయటపడుతుంది. ఇలాంటి వారిలో త్వరితగతిన వ్యాధిని గుర్తించడం కష్టసాధ్యం అవుతుంది.

అప్పుడే డయాలసిస్

కిడ్నీ పనితీరు 10శాతం కంటే తక్కువగా పడిపోయినప్పుడు రోగికి డయాలసిస్ తప్పదు. అంతే కాకుండా హఠాత్తుగా మూత్రం నిలిచిపోయినప్పుడు, ఊపిరి తిత్తుల్లో నీరు చేరి ఆయాసం అనిపిస్తుంది. శరీంలో యాసిడ్స్, పొటాషియం స్థాయిలు పెరిగినప్పుడు కిడ్నీ పనితీరుతో సంబంధం లేకుండా రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. ఒక్కసారి డయాలసిస్ మొదలైతే జీవితాంతం చేయించుకోఅల్సిన అవసరం ఉండదు. తాత్కాలిక రుగ్మతలు అయితే సమస్య పరిష్కారం అయ్యేంత వరకు మాత్రమే డయాలసిస్ చేస్తే సరిపోతుంది. కిడ్నీ పనితీరు మెరుగయ్యాక డయాలసిస్ నిలిపివేస్తారు. అయితే దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితుల్లో జీవితాంతం చేయాల్సి ఉంటుంది.

సూపర్ స్పెషాలిటీలో కిడ్నీ వైద్య సేవలు

ఎంజీఎం ఆస్పత్రికి అనుబంధంగా కాకతీయ మెడికల్ కళాశాలలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధం వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. నెఫ్రాలజీ విభాగంలో ఒక విభాగం అధిపతి, ముగ్గురు వైద్యులు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, యురాలజీ విభాగంలో ఒక విభాగం అధిపతి, నలుగురు వైద్యులు, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

డయాలసిస్ సెంటర్‌లో సౌకర్యాలు నిల్

కాకతీయ వైద్య కలాశాల ఆవరణలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌లో సరైన సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిడ్నీ సంబంధ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో 2022 జూలై 7న ఇక్కడ నెఫ్రాలజీ విభాగాన్ని ప్రారంభించారు. వారానికి రెండుసార్లు ఓపీ సేవలు నిర్వర్తిస్తుండగా నెలలో 500 వరకు ఓపీ ఉంటుంది. వారిలో 200 మంది రోగులు ఆస్పత్రిలో అడ్మిట్ అయి చికిత్స పొందుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు

కిడ్నీ సంబంధిత వ్యాధి క్షణాలు సులభంగా బయటపడవు. కాబట్టి సంవత్సరానికి ఒక్కసారైనా కంప్లీట్ యూరిన్ ఎగ్జామిషన్, సీరం క్రియాటిన్, కిడ్నీ పనితీరును తెలియజేసే గ్లోమేరు లార్ ఫిల్టరేషన్ రేట్ పరీక్షలు విధిగా చేయించుకోవాలి. వీటికి తోడు బీపీ, షుగర్ తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలి. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాయామం చేయాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. పెయిన్ కిల్లర్స్ సప్లిమెంట్ వాటిని సాధ్యమైనంత మేర తగ్గించాలి. శరీర బరువును బట్టి నీరు తాగాలి. రోజుకు కనీసం 3లీటర్ల నీరు తాగాల్సి ఉంటుంది. నీరు మరీ ఎక్కువ తాగినా మూత్రపిండాలపై భారం పడి పనితీరు దెబ్బతింటుంది.

కిడ్నీ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



కిడ్నీ సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దు. సమస్య ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలి. ప్యాకెట్ ఫుడ్, జంక్‌ఫుడ్, సోడా, కొలెస్ట్రాల్ లాంటి వాటిని పూర్తిగా తగ్గించాలి. వేసవికాలంలో మూత్ర పిండాల్లో రాళ్లు, అక్యూట్ కిడ్నీ ఇంజురీ నివారించేందుకు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో డిహైడ్రేషన్ వల్ల మూత్రపిండ సమస్యలు ఉత్పన్నం అవుతాయి. రోజుకు కనీసం 2.5లీటర్ల నుంచి మూడు లీటర్ల నీటిని తాగాలి. ఉష్ణోగ్రత పెరిగిన కొద్ది నీటిని కూడా మరింత తీసుకోవడం మంచిది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడకుండా సహకరిస్తాయి. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవలి. షుగర్ లెవెల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. ప్రతిరోజు 30 నుంచి 45 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయడం వల్ల మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయి. మూత్రపిండాల ఆరోగ్యాన్ని క్రమంగా పరీక్ష చేయించుకోవాలి.

\- డాక్టర్ బచ్చు చందుకృష్ణ, ఎంఎస్, ఎంసీహెచ్, యురాలజిస్టు

అధికంగా పెయిన్ కిల్లర్స్ వాడొద్దు



ఈ మధ్యకాలంలో బీపీ, షుగర్, ఊబకాయం ఉన్న వారితో పాటు పెయిన్ కిల్లర్స్ వాడే వారిలో మూత్రపిండ వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయి. చెరుకు రసం, బార్లీ నీళ్లు, పుచ్చకాయ వంటి సహజ మూత్ర విసర్జ ఉత్ప్రేరకాల రకాలు తీసుకోవాలి. ఈ పానీయాలు మూత్రాన్ని అధికంగా ఉత్పత్తి చేయించి చిన్న చిన్న రాళ్లను విసర్జించడంలో సహాయ పడతాయి. కనీసం ఆరు నెలలకోసారి అయినా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి.

\- డాక్టర్ పూస కుమారస్వామి, నెఫ్రాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్ , ఎంజీఎం



ర్యాలీని ప్రారంభించిన బిషప్..



చర్చిలో ప్రసంగిస్తున్న ఫాదర్‌లు

వైభవంగా ఫాతిమామాత మహారథ ప్రదక్షిణ

భారీగా హాజరైన క్రైస్తవులు.. కొనసాగుతున్న ఉత్సవాలు

కాజీపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఫాతిమానగర్‌లోని ఫాతిమామాత ఉత్సవాలు బుధవారం రెండో రోజు వైభవంగా సాగాయి. బుధవారం సాయంత్రం కేథడ్రల్ చర్చిలో ఫాతిమామాత స్వరూపంతో మహా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని బిషప్ ఉడుమల బాల ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఫాతిమానగర్‌లో ప్రారంభమైన ఈ ర్యాలీకి వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ ర్యాలీ సెయింట్ గ్యాబ్రియెల్ స్కూల్ రోడ్, ఫాతిమా ఆస్పత్రి మీదుగా దర్గా వరకు సాగి తిరిగి ఫాతిమా కెథడ్రల్ చర్చి వరకు సాగింది. అనంతరం నూతనంగా నిర్మించిన ఫాతిమా ప్రధాన రహదారి తోరణం వద్ద ప్రత్యేక ఆశీర్వాద ప్రార్థన జరిగింది. అనంతరం కెథడ్రల్ చర్చిలో జపమాల ఉద్యానవనం ఆశీర్వాద కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఫాదర్‌లు స్వస్థత ప్రార్థనలు చేశారు. మేరీ మాత గుహవద్ద క్రైస్తవులు పెద్దఎత్తున మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు చర్చి ఆవరణలో మొక్కులు చెల్లించి నిద్ర చేశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఫాదర్ టి.జోసెఫ్, ఫాదర్ డి.జోసెఫ్, కర్నూల్ పీఠం బోధకులు ఏరువ జోజిరెడ్డి భక్తులకు స్వస్థత ప్రార్థనలు చేశారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులతో ఫాతిమానగర్ జాతర వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా చర్చి కమిటీ అధ్యక్షుడు బొక్క దయాసాగర్ బృందం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలను తలెత్తకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి బృందం భారీ బందోబస్తు నిర్వహించారు. రాత్రి పునీత ఆంథోని కళాక్షేత్రంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఎర్రగట్టు వేంకన్న జాతరకు వేళాయే..

- రేపటి నుంచి ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి.. పోలీసుల బందోబస్తు


హసన్‌పర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి (ఎర్రగట్టు జాతర) బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారి సమీపంలోని అంబాల క్రాస్‌రోడ్డు వద్ద గుట్టపై వెలిసిన ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి జాతర ఏటా మార్చిలో హోలీ ఫాల్గుణ పౌర్ణమి రోజు ప్రారంభమై ఐదు రోజుల పాటు కొనసాగుతాయి. జాతరకు కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.

హోలీ పర్వదినం నుంచి జాతర

యేటా హోలీ పర్వదినం రోజు నుంచే ఎర్రగట్టు జాతర కొనసాగుతూ వస్తోంది. సాయంత్రం హసన్‌పర్తి, భీమారం గ్రామాల ఆలయాల నుంచి శ్రీ అలివేలు మంగమ్మ పద్మావతి సమేత శ్రీనివాసుల ఉత్సవ మూర్తుల విగ్రహ ప్రతిమలతో ఊరేగింపుగా ఎర్రగట్టుగుట్టకు చేరుకుంటాయి. జాతరలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్వక్‌సేనా సేవా సమితి కళ్యాణ మండపంలో వేదపండితులు వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని నిర్వహించడంతో జాతర ప్రారంభమవుతుంది. 14వ తేదీ శుక్రవారం కల్యాణోత్సవం మొదటి రోజు రాత్రి వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద రథచక్రాల బండ్లలో జాతర ప్రాంగణానికి చేరుకొని ధ్వజస్తంభం చుట్టూ ప్రదిక్షణలు చేసి స్వామివారి కల్యాణాన్ని చూసి తరించి మొక్కులు చెల్లించుకుంటారు. 15వ తేదీన రెండో రోజు శనివారం మేకలు, గొర్రెలు, పోతులు, ఏనుగులతో చిన్న రథచక్రాల బండ్లతో గుట్టకుచేరుకొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించు కుంటారు. 16వ తేదీ ఆదివారం స్వామివారి విశేషపూజ, కుంకుమార్చన, హారతి, ప్రసాద వినియోగం, 17వ తేదీ సోమవారం స్వామివారికి క్షీరాభిషేకం, అర్చనలు, 18వ తేదీ మంగళవారం ఉత్సవమూర్తు ల ప్రతిమలు ఇరు గ్రామాలకు తిరుగుపయణం కావడంతో జాతర ముగుస్తుంది.



గుట్టపైకి వెళ్లే మెట్లకి ఇరువైపుల ఏర్పాటు చేసిన పైప్‌లైన్



ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి

పోలీసు బందోబస్తు

ఐదు రోజుల పాటు జరిగే జాతర ఉత్సవ వేడుకల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటితో పాటు రాత్రి వేళలోగుట్టపైకి వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. గుట్టపైకి మెట్లు ఎక్కే క్రమంలో భక్తులకు ఏవిధమైన ఆటంకాలు జరుగకుండా ప్రత్యేకంగా పోలీసు బం దోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణంలో దొంగతనాల నివారణ తో పాటు పోకిరీల ఆగడాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా పోలీసు నిఘాను పెంచారు. మఫ్టీలో పోలీసు గస్తీని ఏర్పాటు చేసినట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ తెలిపారు. భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జాతర ప్రాంగణంలో ప్రత్యకంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి



వివిధ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వెంకట్రావ్ తెలిపారు. భక్తుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారి నుంచి జాతర ప్రాంగణం వరకు ఆర్టీసీ వారు ప్రత్యేకంగా బస్సులను నడిపుస్తున్నారని తెలిపారు. దేవాలయం ప్రాంగణంలో టీటీడీ కల్యాణ మండపంతో పాటు నవగ్రహాలు, శివాలయం, అభయాంజనేయస్వామి ఆలయం, గోశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేశఖండన కోసం ప్రత్యేక స్థలం, జాతర మొదటి రోజు నిర్వహించే కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తుల కోస ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

\- ఆలయ కార్యనిర్వాహణ అధికారి వెంకట్రావ్

రంజాన్ రుచుల వేదిక మండిబజార్

- నోరూరిస్తున్న స్పెషల్ స్వీట్లు
- ఆస్వాదిస్తున్న నగర వాసులు
- పోషక విలువలతో కూడిన పదార్థాలకు డిమాండ్



మండిబజార్‌లో మసీద్ వద్ద సందడి

మట్టెవాడ మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలను అత్యంత నిష్ఠతో పాటిస్తున్నారు. అయితే ఈ ఆధ్యాత్మిక సౌరభాల రంజాన్ మాసంలో నెల రోజుల పాటు వారు దాన ధర్మాలు చేయడంతో పాటు.. విభిన్న రకాల వంటకాలు, రకారకాల స్వీట్లు, ఫలాలతో పండుగ జరుపుకొంటారు. ఈ క్రమంలో నగరంలోని మండిబజార్‌లో ఆధ్యాత్మిక సందడి కనిపిస్తుంది. రంజాన్ మాసం ప్రారంభం నుంచి నెల రోజుల పాటు రోజంతా కోనుగోళ్ల జోష్ కనిపిస్తుంది. అర్ధరాత్రి వరకు వ్యాపార సమూదాయాలు తెరిచే ఉంటాయి. పోచమ్మమైదాన్, బండిబజార్ వరకు సుమారు కిలోమీటర్ మేరకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటవుతాయి. అలంకరణ వస్తువులు, రోల్‌గోల్డ్ దుకాణాలు, కర్జూర పండ్లు వివిధ రకాల స్వీట్ల దుకాణాలు ఏర్పాటు చేశారు.

నోరూరించే రుచులు..

స్వీట్స్ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు. అందులోనూ ఏడాదిలో ఒక నెల మాత్రమే అందుబాటులో ఉండే స్పెషల్ స్వీట్లు అంటే ఇంకేలా ఉంటుంది. ప్రస్తుతం రంజాన్ స్పెషల్ స్వీట్ల మధురానుభూతిని అందిస్తున్నాయి. వరంగల్ పోచమ్మమైదాన్. మండిబజార్‌లో రుచి, పోషక విలువలు, శరీర ఆరోగ్యానికి సంభందించిన పలు పదర్థాఆలు మిళితమై ఉండటంతో చిన్న, పెద్ద తేడా లేకుండా కులమతాలకు అతీతంగా ప్రజలంతీ తీసుకుంటున్నారు. దీంతో రంజాన్ స్పెషల్ స్వీట్లకు మంచి డిమాండ్ పెరిగింది. ఎన్నో రకాల వెరైటీ స్వీట్లు అందుబాటులో ఉండటంతో ఇళ్ళకు పార్శిల్ తీసుకెళ్ళి మరి రుచులు ఆస్వాదిస్తున్నారు. ముఖ్యంగా డబుల్‌కా మీఠా, కద్దుకీ ఖీర్, మ్యాంగో ఖీర్, కుర్బానీ కా మీఠా, హల్వా, ఫెర్ని, రబ్బి తదితర స్వీట్లకు డిమాండ్ ఉంది. నగరంలో అనేక చోట్ల అమ్మకాలు జరుగుతున్నా.. కేవలం మండిబజార్ ప్రాంతంలోనే సుమారు 20వరకు షాపులు ఉండటం విశేషం. ఇక్కడి వర్తకులు పోటీపడి మరీ ప్రజలకు ప్రత్యేక వంటకాలను పరిచయం చేస్తున్నారు.

డబుల్ కా మీఠా....

రంజాన్ స్పెషల్ స్వీట్లలో డబుల్ కా మీఠాను ప్రతీ ఒక్కరు ఇష్టపడుతారు. బ్రెడ్, డాల్డా, నూనె, పాలు, నెయ్యి, చెక్కర, కస్టడ్ పౌడర్, కోవా, బాదాం, కిస్‌మిస్‌లతో డబుల్ కా మీఠాను తయారు చేస్తారు. ఇది ఎంతో తియ్యగా ఉండటంతో ప్రతి ఒక్కరు దీనిని ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ఇది మార్కెట్లో ఒక ప్లేటు రూ.30 ఉంది.

ఖద్దుకీ ఖీర్..

రంజాన్ పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ఖద్దుకీ ఖీర్. దీనిని రంజాన్‌లో ప్రత్యేక వంటకంగా భావిస్తారు. దీనిని ఇష్టపడని వారు ఉండరు. పాలు, సొరకాయ, కోవా, సాపుదాని బియ్యం, చెక్కర, పిస్తా, బాదం, ఇలాచీ, నెయ్యి, మిల్క్‌మ్యాట్ వినియోగించి దీనిని తయారు చేస్తారు. ఇది తాగితే శరీరంలోని వేడి పోతుందని, ఆరోగ్యకరమైన పానీయమని అమ్మకందారులు చెబుతున్నారు.



పండ్లను విక్రయిస్తున్న దృశ్యం

మ్యాంగో ఖీర్..

రంజాన్ స్పెషల్ స్వీట్లలో బాగంగా తయారు చేసే మ్యాంగో ఖీర్ కొన్ని చోట్ల మాత్రమే లభిస్తుంది. మామిడి పండ్ల గుజ్జును తీసి పాలు, మిల్క్‌మ్యాట్, కోవ ఉపయోగించి దీనిని తయారు చేస్తారు.

హల్వా..

గుమ్మడికాయ, నెయ్యి, కాజు, పాలు, బాదం, చెక్కరతో హల్వాను తయారు చేస్తారు. దీనిని చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతిఒక్కరు ఇష్టపడుతున్నారు.



రంజాన్ ప్రత్యేక రుచుల విక్రయాలు

కుర్బానీ కా మీఠా..

రంజాన్ స్పెషల్ స్వీట్లలో కుర్బానీ కా మీఠా మరీ స్పెషల్‌గా చెప్పుకోవచ్చు. కుర్బానీ కా మీఠాను ఆఫ్ఘనిస్థాన్ నుంచి దిగుమతి అయ్యే డ్రైఫ్రూట్లతో తయారు చేస్తారు. డ్రైఫ్రూట్స్‌ను నీటిలో నానాబెట్టి తరువాత గింజలు తీసివేసి పంచదార పాకంలో రోజ్‌బెర్రి, సిరప్‌లు వినియోగించి తయారు చేస్తారు. దీనికి మార్కెట్లో మంచి గిరాకి ఉంది. ఇది అరుదుగా లభించే స్వీటు.

ఫిర్ని..

ఇది చాలా అరుదుగా లభించే వంటకం. బాస్మతి రైస్‌ను రవ్వగా చేసి ఉడకబెడుతారు. తరువాత చెక్కర, కోవ, మిల్క్‌మ్యాట్‌తో దీనిని మహా రుచిగా తయారు చేస్తారు.

రబ్బి..

పాలు, కస్టర్డ్ పౌడర్, చెక్కర, మిల్క్‌మ్యాట్ ఉపయోగించి రబ్బి స్వీట్‌ను తయారు చేస్తారు. ఇది కొన్ని చోట్ల మాత్రమే లభిస్తుంది. దీనికి మంచి డిమాండ్ ఉంది.

సింహవాహనంపై లక్ష్మీనరసింహ స్వామి



సింహవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

రేగొండ, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : కోటంచ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నాలుగో రోజు బుధవారం ఘనంగా జరిగాయి. స్వామి వారికి ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యులు పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించిన సింహవాహనంపై స్వామివారిని డప్పు చప్పుళ్లు, గోవింద నామస్మరణ మధ్య భక్తులు ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మహేష్, ఛైర్మన్ ముల్కనూరి భిక్షపతి, మాజీ సర్పంచ్ పబ్బా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సిద్ధార్థ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు చివరి గడువు అని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 745 జిల్లాలు, 25 సెక్టార్లలో 1.25 లక్షల కంటే ఎక్కువగా ఇంటర్న్‌షిప్ ఇవ్వడానికి అవకాశం ఉందని తెలిపారు. యువత సొంత రాష్ట్రంలో గానీ, ఇతర రాష్ట్రాల్లో గానీ అవకాశం ఉందని వివరించారు. దరఖాస్తు చేసేందుకు పీఎంఇంటర్న్‌షిప్.ఎంసీఏ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 1800116090 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 23 ఇంటర్న్‌షిప్‌లు కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు 21 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, పదో తరగతి వారికి 13, డిప్లొమా చేసిన వారికి 2, ఐటీఐ పూర్తి చేసిన వారికి 8, మందికి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.5వేల గౌరవ ఉపకార వేతనం ఇవ్వనున్నట్టు తెలిపారు.

టీజేఎస్ జిల్లా అధ్యక్షురాలిని సన్మానించిన కోదండరాం

కృష్ణకాలనీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు బూడిద లావణ్యను ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సన్మానించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురసరించుకొని కార్యక్రమం నిర్వహించగా జిల్లా నుంచి పాల్గొన్న లావణ్యను కోదండరాం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు లక్ష్మి, పుష్ప, రాణి, సాకుబాయి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌వోడీలుగా బయటి వ్యక్తులను నియమించొద్దు

కృష్ణకాలనీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో విభాగాధిపతులు (హెచ్‌వోడీ)గా బయటి వ్యక్తులను నియమించొద్దని సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షుడు టి. వెంకటరామిరెడ్డి కోరారు. ఈ మేరకు సంఘం సభ్యులతో జీఎం రాజేశ్వర్‌రెడ్డిని కలిసి ఆయన ద్వారా సింగరేణి సీఅండ్ఎండీకి లేఖను పంపారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాలు పైబడిన అనుభవం ఉన్న వ్యక్తులు ఉన్నారని, అలాంటి వారికి అవకాశాలు కల్పించాలని కోరారు. అంకితభావంతో పని చేసే అధికారులను నిరుత్సాహ పరిచేలా బయటి వ్యక్తులను నియమించడం బాధాకరమన్నారు. ఇటీవల విడుదల చేసిన చీఫ్ అఫ్ మెడికల్ సర్వీసెస్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఉద్యోగ ప్రకటనలను వెంటనే పునః పరిశీలించి ఉపసంహరించాలని కోరారు.

సీఎస్ఆర్ నిధులపై విచారణ చేపట్టాలి

మల్హర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : తాడిచర్ల ఓసీపీలో బొగ్గు నిక్షేపాలు వెలికితీస్తున్న కంపెనీ సీఎస్ఆర్ నిధులపై విచారణ చేపట్టాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ పీక కిరణ్ డిమాండ్ చేశారు. గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కంపెనీ సిబ్బందితో ఆస్పత్రిలో ఏర్పాటు చేసి ప్రభుత్వ మందులకు ప్రైవేటు బిల్లులతో పెద్ద సీఎస్ఆర్ నిధులను కాజేస్తున్నట్లు ఆరోపించారు. నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అలాగే డేంజర్ జోన్‌లోని ఇళ్లు, భూములు సేకరించి సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ పార్వతి, శంకర్, మీనుగు నాగేష్, విజయ్‌కుమార్, పోలోజు సత్యనారాయణ పాల్గొన్నారు.

భద్రూ నాయక్,
మంగపేట
ఎంపీడీవో



ముఖాముఖి

త్వరలోనే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు

ఆంధ్రజ్యోతి: వేసవిలో తాగు నీటి ఎద్దడిని ఎలా నివారిస్తున్నారు?

ఎంపీడీవో: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ప్రజలకు తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నాం. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ మోడల్‌గా ఏ గ్రామాన్ని ఎంపిక చేశారు?

ఎంపీడీవో: మండలంలోని మారుమూల గ్రామమైన పూరేడుపల్లిని ఎంపిక చేశాం.

ఆంధ్రజ్యోతి: లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారా?

ఎంపీడీవో: మోడల్ విలేజ్ అయిన పూరేడుపల్లిలో మొదటి దఫా 67 ఇళ్లను అర్హులకు మంజూరు చేశాం. మిగతా గ్రామాల్లోనూ త్వరలోనే మంజూరు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధిహామీ పనులు ఏవిధంగా జరుగుతున్నాయి?

ఎంపీడీవో: గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జనవరి నెల నుంచి ప్రారంభమయ్యాయి. 630 మంది కూలీలతో పనులను ప్రారంభించాం.

ఆంధ్రజ్యోతి: ఎస్సీ కార్పొరేషన్ పథకం అమలు ఎలా ఉంది?

ఎంపీడీవో: ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎస్సీ కార్పొరేషన్ పథకాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నాం. ఆయా బ్యాంక్‌ల అనుమతితోనే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాం. అన్ని గ్రామాల్లో అర్హులైన 30ని బ్యాంకులకు అనుమతి కోసం ప్రతిపాదనాలు పంపించాం.

- మంగపేట (ఆంధ్రజ్యోతి)

తాగునీటి ఎద్దడిని నివారించాలి

అధికారులతో కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

వాజేడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ టి.ఎస్.దివాకర ఆదేశించారు. అవసరమైతే వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావుతో కలిసి మండల స్థాయి అధికారులతో కలెక్టర్ బుధవారం సమావేశమయ్యారు. తాగునీటి సమస్య, పరిష్కార మార్గాలపై సమీక్షించారు. ముఖ్యంగా మిషన్ భగీరథ, వ్యవసాయ, ఆర్‌అండ్‌బీ శాఖలతో పాటు తదితర శాఖల పని తీరుపై ఆరా తీశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలని అన్నారు.. మండలంలోని పనిచేసే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉందన్నారు. అర్హులైన వారికి లబ్ధి చేకూరడంలో ఎంపీడీవో, ఎంపీవో చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలపై కాంగ్రెస్ నాయకులు విక్రాంత్ వర్మ ఆధ్వర్యంలో పలువురు వినతిపత్రాలను అందించారు. ముఖ్యంగా చెరుకూరు, ధర్మవరం, కడేకల్, బొమ్మనపల్లి, ప్రగళ్లపల్లి గ్రామాల్లో రహదారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మొక్కజొన్న రైతులను ఆదుకుంటాం

బాండ్ మొక్కజొన్నతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కలెక్టర్ దివాకర అన్నారు. సమీక్ష సమావేశం సందర్భంగా ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి ఆధ్వర్యంలో నాయకులు, రైతులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించగా ఆయన ఈ మేరకు స్పందించారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లో మొక్కజొన్న పంటతో నష్టపోయిన రైతుల వివరాలను ఇప్పటికే సేకరించామన్నారు. రైతుల పేర్లను గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తున్నామన్నారు. ఇంకా పేర్లు నమోదు కాని రైతులు ఎవరైనా ఉంటే గురువారంలోగా నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత బాండ్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్నామని, రైతులకు నష్టపరిహారం అందేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అదే విధంగా రైతులకు వడ్డీల రూపంలో డబ్బులిచ్చి తిరిగి అప్పులు చెల్లించే క్రమంలో నిలువుదోపిడీకి గురి చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసు కేసులు నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో ఎక్కువ రేట్లకు మందులను విక్రయిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకూ న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు.

ఐడీవోసీ పనులను పరిశీలించిన కలెక్టర్

ములుగు (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన జరుగుతున్న సమీకృత జిల్లా కార్యాలయాల భవన నిర్మాణ (ఐడీవోసీ) పనులను కలెక్టర్ దివాకర అధికారులతో కలిసి పరిశీలించారు. అన్ని మౌలిక సదు పాయాలు కల్పిస్తూ నిర్మాణం జరగాలన్నారు. త్వరితగతిన కాం పౌండ్‌వాల్, వెలివేషన్, పేయింటింగ్, గ్రీనరీ, భవన సుందరీకరణ పనులను పూర్తి చేయాలని, పనులు నాణ్యత కలిగి ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చిద్నెపల్లిలో భూసేకరణపై గ్రామసభ

కాటారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గారెపల్లి నూతన రిజర్వాయర్ నుంచి చింతకాని, చిద్నెపల్లి, ప్రతాపగిరి గ్రామాల పరిధిలో చేపట్టే కెనాల్స్ సంబంధించిన 32ఎకరాల 38గుంటల భూసేకరణ కోసం బుధవారం గ్రామసభ నిర్వహించారు. కాటారం తహసీల్దార్ నాగరాజు, ఇరిగేషన్ ఈఈ యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో పలువురు రైతులు హాజరై తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలిపారు. కోమటికుంట చెరువు కట్ట కింద కెనాల్ తీసుకెళ్లడానికి ప్రతిపాదించారని, ఆ చెరువులోకి నీళ్లివ్వాలని రైతులు కోరారు. సేకరించే భూములకు మొదట ఎంత పరిహారమిస్తారో చెప్పాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయం కలెక్టర్ తెలుస్తారని అధికారులు చెప్పారు. గ్రామసభలో గందరగోళం జరగకుండా కాటారం ఎస్సై అభినవ్, ఎస్సై-2 శ్రీనివాస్, పీఎస్సై గీతారాథోడ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఐ గంగాధర్, నాయబ్ తహసీల్దార్లు శివతేజ, షఫీ అహ్మద్, ఆర్ఐ వెంకటయ్య, ఇరిగేషన్ ఏఈ వెంకన్న, మండల సర్వేయర్ వినయ్, మాజీ ప్రజాప్రతినిధులు రవీందర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, నర్సింగరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి కుటుంబానికి ఆర్థిక సాయం

గోవిందరావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బండి ఆనంద్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ పరామర్శించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దాసరి సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, నాయకులు కణతల నాగేందర్‌రావు, సూరపనేని సాయిబాబు, జంపాల చంద్రశేఖర్, గోపిదాసు ఏడుకొండలు, మద్దాల నాగమణి, రామచంద్రపు వెంకటేశ్వర్‌రావు, రేగుల లక్ష్మణ్, జెట్టి రాజు, మాజిత, మిరియాల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

భూపాలపల్లిటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను చేపట్టి మాదిగలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని, అప్పటి వరకు గ్రూప్ 1, 2, 3లకు సంబంధించిన ఉద్యోగాల భర్తీని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఎమ్మార్పీఎస్ రిలేనిరాహార దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి అంబాల చంద్రమౌళి ప్రారంభించగా నాయకులు రాం చందర్ మాదిగ, అనిల్‌కుమార్, శ్రీకాంత్, బేడబుడిగ జంగం నాయకులు తూర్పాటి రాజు, మచ్చ పైడి, సర్వోత్తమ్, సదయ్య, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : డీఎంహెచ్‌వో

మహదేవపూర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం పరిధి అన్నారం హెల్త్ సబ్ సెంటర్‌లోని నాగెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) మధుసూదన్ అన్నారు. వైద్య శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. పలువురికి స్వయంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాదేవి, మెడికల్ ఆఫీసర్ సుష్మిత ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురికి రక్త నమూనా సేకరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి టిమోపాస్ స్ప్రే చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రమ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, పీహెచ్ఎన్ నీరజ, జిల్లా ఎపిడమిక్ టీం మెంబర్స్ పరమేశ్వర్, గోపి, సతీష్, మెల్త్ అసిస్టెంట్ అడప, రాజ రమణయ్య, ల్యాబ్ టెక్నీషన్లు, శ్రీనివాస్, ఏఎన్ఎం విజయ, ఆశా కార్యకర్తలు జరీనా, స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విగ్రహాల తొలగింపు

చిట్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుకుతండా శివారు సర్వే నెం.220లో గత 30క్రితం నుంచి గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్, సేత్యా భవానిదేవి విగ్రహాలను నెలకొల్పి పూజలు చేస్తున్నామని, గ్రామానికి చెందిన నర్రా రాజిరెడ్డి జేసీబీ యంత్రం సహాయంతో అక్రమంగా వాటిని తొలగించారని సేవాలాల్ సేన నాయకులు అజ్మీరా రాజునాయక్, బానోతు రాజునాయక్ తెలి పారు.

విగ్రహాలను తొలగించాడని తెలిపారు. గిరిజనుల మనోభావాలను కించపరిచిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి వెంట బానోతు సమ్మయ్య, లావుడ్యా నాగి, అజ్మీరా కల్యాణ్ సింగ్, సమ్మయ్య, బబ్లీనాయక్, సమ్మూలాల్, రామునాయక్, రవినాయక్ తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న పంట నష్టాలపై పరిశీలన

వాజేడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బాండ్ మొక్కజొన్న వ్యవసాయంతో నష్టపోయిన రైతుల వివరాలను హైదరాబాద్ రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకుల బృందం బుధవారం సాయంత్రం పరిశీలించింది. బాండ్ మొక్కజొన్నతో రైతులు తీవ్రంగా నష్టపోవడంతో రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మండలంలోని అరుణాచలపురం, బిజినేపల్లిలో బాండ్ మొక్కజొన్న పంటను బృందం సభ్యులు పరిశీలించారు. పంట నమూనాలను సేకరించారు. ఈ క్రమంలో రైతులు సింజెంటా, హైటెక్, తదితర కంపెనీలకు చెందిన బాండ్ మొక్కజొన్న వేశామని బృందం దృష్టికి తీసుకెళ్లారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం వచ్చినట్లు తెలిపారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లో రాష్ట్ర బృందం కంపెనీలు, ఆర్గనైజర్ల వివరాలను సేకరించి ప్రభుత్వం దృష్టికి నివేదికల రూపంలో అందజేయనున్నారు. జేడీ జి.లక్ష్మణ్, డీడీ కె శంకరయ్య, ఏడీఎస్సీ బి.సంతోష్‌కుమార్, ఏడీఎస్సీ పి. వేమ, ఎస్సీవోలు వేణుమాధవ్, అపర్ణ, ఏఈవో జాఫర్ తదితరులు ఉన్నారు.

చింతకుంటలో బొడ్రాయి ఉత్సవాలు

మంగపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన నిమ్మగూడెం పరిధి చింతకుంటలోబొడ్రాయి ఉత్సవాలను గ్రామస్థులు జరుపుకొంటున్నారు. ఈనెల 10న ఇవిఇ ప్రారంభమయ్యాయి. బుధవారం భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన బ్రహ్మశ్రీ వేల్పుల వీరస్వామిశర్మ ఆధ్వర్యంలో గాయాత్రీ పీఠాదిపతి శిష్య బృందం సభ్యులు ప్రతిష్ఠాపన ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించారు.

మావోయిస్టు కొరియర్ల అరెస్టు

(5వ పేజీ తరువాయి)

ఇల్లెందుల విజయ్, అదే మండలంలోని తీగారం గ్రామానికి చెందిన ఈరెల్లి నాగరాజు ఉన్నారని, వీరు మావోయిస్టు పార్టీ కొరియర్‌గా పనిచేస్తున్నారని వివరించారు. అలాగే అరెస్టు అయిన మరో ఇద్దరిలో ములుగు జిల్లా వెంకటాపురం మండలం పామునూరు గ్రామానికి చెందిన మడివి పాండు, అదే మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన మడివి భీమా ఉన్నారని, వీరు మావోయిస్టు పార్టీలో మిలీషియా సభ్యు లుగా కొనసాగుతున్నారని వివరించారు. కొంత కాలంగా ఇల్లెందుల విజ య్, ఈరెల్లి నాగరాజు సీపీఐ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కరావు అలియాస్ దామోదర్ వద్ద వీరు పని చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో వెంకటాపురం సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి : ఎమ్మార్పీఎస్

టేకుమట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పూర్తియిన తర్వాతే ప్రభుత్వం నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీస్ జిల్లా నాయ కుడు రాం రాంచందర్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణ పూర్తి కాకముందే ప్రభుత్వం నియా మకాలను చేపట్టడాన్ని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల శంకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరహార దీక్షను బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం జిల్లా నాయకుడు రాం రాంచదర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తు చేశారు. దేశంలోనే ఎస్సీ వర్గీకరణ అమలులో తెలంగాణ మొదటి సానంలో ఉంటం దని అసెంబ్లీలో ఆయన మాట్లాడారని అన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం విడుదల చేసిన అన్ని నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ వర్తింపజేస్తామని హామీ ఇచ్చి, మాటను తుంగలో తొక్కుతు న్నారన్నారు. ఫలితాలను ప్రకటించడాన్ని వాయిదా వేసి వర్గీకరణ పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మచ్చ శ్రీకాంత్, అంబాల అనిల్ పాల్గొన్నారు.

రామప్ప ఆవరణలో మహిళా దినోత్సవం

వెంకటాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధిగాంచిన రామప్ప దేవాలయం ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పురావస్తుశాఖ గోల్కొండ ఇన్‌చార్జి మడిపెల్లి మల్లేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా పురావస్తు శాఖ హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు రామప్ప ఇన్‌చార్జి నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పురావస్తుశాఖ కోఆర్డినేటర్ కుమారస్వామి, దేవాదాయశాఖ, పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ములుగు డిగ్రీ కళాశాలలో...

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం, కన్వీనర్ ఆర్.తేజోలత విద్యార్థినులు, మహిళా ఉద్యోగులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల స్టాఫ్ సెక్రటరీ జె.సోమన్న, అధ్యాపకులు విజిత, శంకర్, ఉదయశ్రీ, శ్రీను, మౌలానా, రమేష్, అనిత, ఎస్.రమేష్, లక్ష్మి, షరీఫా తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు

వెంకటాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూగూరు, ఆలుబాక గ్రామాల్లో బుధవారం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో వేర్వేరుగా వైద్యశిబిరాలు జరిగాయి. ఈసందర్భంగా ఆమె ఆయా గ్రామాల్లోని 24మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు రోజువారీగా మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారులు స్నేహారెడ్డి, సత్యనారాయణ, సిబ్బంది యాకలక్ష్మి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గోవింద్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న గోవింద్‌నాయక్

గోవిందరావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బాండ్ మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన జిల్లాలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్‌పార్టీ జిల్లా నాయకుడు, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని రైతులు వందల ఎకరాల్లో రైతులు బాండ్ మొక్కజొన్న పంట సాగుచేశారని, దీనిని అదనుగా చేసుకుని ఆ కంపెనీ ప్రతినిధులు, దళారులు చీకటి ఒప్పందం చేసుకుని నకిలీ విత్తనాలు సరఫరా చేశారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లా వ్యవసాయ అధికారులను పంపించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి నష్టపోయిన మొక్కజొన్న రైతుల వివరాలు సేకరించడంతోపాటు తగిన నష్టపరిహారం అందించాలని, ఆయా కంపెనీల ఆర్గనైజర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నాంపూర్ణచందర్, ఈసం సమ్మయ్య, శ్రీనివాస్, జ్యోతి, రఘు, బొల్లం ప్రసాద్, మధు, ఓదెలు, సంజీవ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

వాజేడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపురంలో బుధవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. సమ్మక్క-సారక్క జాతరను పురస్కరించుకొని నాలుగు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యుడు జెజ్జరి దామోదర్ అన్నారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్సం ప్రవీణ్, శాంతకుమారి, పూనెం కృష్ణ బాబు, నిర్వహణ కమిటీ సభ్యులు ఎట్టి పవన్, బొగ్గం బాబు, చేప అర్జున్, ఎట్టి శివ, వీడీ బొత్స నర్సింహమూర్తి పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెరగాలి

వాజేడు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెరగాలని డీఎంహెచ్‌వో గోపాలరావు అన్నారు. వాజేడు పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆస్పత్రి రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఏఎన్ఎంలు, వైద్యసిబ్బందిపై ఉందన్నారు. అదే విధంగా క్షయ బాధితులకు నెలనెలా మందులు అందజేయాలన్నారు. ఎండాకాలంలో వడదెబ్బలు తగలకుండా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతికుమార్, వాజేడు, పేరూరు వైద్యాధికారులు మధుకర్, రాహీల్ తదితరులు ఉన్నారు.

'ఆదివాసీలకు డీకే అరుణ క్షమాపణ చెప్పాలి'

ఏటూరునాగారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో షెడ్యూల్ తెగలపై అనుచితంగా వ్యాఖ్యలు చేసిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ క్షమాపణ చెప్పాలని ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు వట్టం సుభద్ర డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆదివాసీ మహిళా సంఘం నాయకురాలు కొమురం లక్ష్మీకాంత ఆధ్వర్యంలో బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో సుభద్ర మాట్లాడారు. మైదాన ప్రాంతాల్లోని ఓసీ, బీసీ కులాలను తెలంగాణలోని 20 లక్షల వాల్మీకి బోయ గిరిజనేతర కులాలను షెడ్యూల్ తెగల్లో చేర్చాలని డీకే అరుణ పార్లమెంట్ సాక్షిగా మాట్లాడటం ఆదివాసీ సమాజాన్ని అవమానించినట్లే అని మండిపడ్డారు. తన వ్యాఖ్యలను ఆమె వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఏజెన్సీ ప్రాంతంలోని బీజేపీ నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళ సంఘం సభ్యులు వట్టం సుధ, ససప లలిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పర్యటన

మంగపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య మండలంలోని పలు గ్రామాల్లో బుధారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను కలిసిన ఆయన పార్టీ బలోపేతం కోసం చేయాల్సి కృషికి దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి కర్రీ నాగేంద్రబాబు, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకతి సాంబశివరావు, సహకార సంఘం డైరెక్టర్ గంటా సునీత రామారావు, మాజీ సర్పంచ్‌లు కోరం అబ్బయ్య, సున్నం ఆనందం, కాంగ్రెస్ నాయకులు వేణు. రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ తరలింపుపై విచారణ

వెంకటాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్లగూడెం పంచాయతీ పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో సోమవారం రాత్రి బియ్యం అక్రమ తరలింపుపై అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. ఏటీడబ్ల్యూవో క్షేత్రయ్య ఆధ్వర్యంలో అధికారులు పాఠశాలను తనిఖీ చేశారు. స్టాక్‌రూంలో ఉన్న నిల్వలను పరిశీలించడంతోపాటు రికార్డులను తనిఖీ చేశారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఏటీడబ్ల్యూవో క్షేత్రయ్య తెలిపారు.